సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం | 19 | ఆగస్టు | 2024



అంచెలంచెలుగా అభివృద్ధి..

నిత్య చైతన్య దీప్తిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన చదువుల ఒడి.. కాకతీయ యూనివర్సిటీ.

- 8లో▸



అప్పులున్నా ఆరుగ్యారంటీల అమలు

ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.3⁰ /26.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోదండరాంను కలిసిన టీజేఎస్ నాయకులు



భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను భూపాలపల్లి ఏరియాకు చెందిన టీజేఎస్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో తన నివాసంలో కలిసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, నాయకులు రత్నం కిరణ్, బాబు, జాలిగం రాజు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

రేగొండ: గుడుంబా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు మండలంలోని రామన్నగూడెం తండాకు చెందిన ఇస్లావత్ భూల్యా ఇంట్లో ఆదివారం అధికారులు దాడులు నిర్వహించారు. నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

సన్మానం..



భూపాలపల్లి రూరల్: జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సహాయ సంచాలకురాలు డాక్టర్ శ్రీదేవి గోదావరిఖని ఏరియా వెటర్నరీ హాస్పటిల్‌కు బదిలీ కావడంతో ఆదివారం ఉద్యోగులు శ్రీదేవికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండల వైద్యాధికారితో పాటు వివిధ మండలాలకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంఎస్ కార్యాలయం ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో నూతనంగా నిర్మించిన బీఎంఎస్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆదివారం ఆ సంఘం జాతీయ కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణితో పాటు కోల్ ఇండియా వ్యాప్తంగా బీఎంఎస్ చిత్తశుద్ధితో పని చేస్తూ కార్మికుల హక్కులను సాధిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి రెగ్యులర్ కార్మికులకు అమలు చేస్తున్న హక్కులు, సౌకర్యాలు, ఇతర బెనిఫిట్స్ కాంట్రాక్ట్ కార్మికులకు అందించేందుకు పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, స్థానిక నాయకులు పులి రాజిరెడ్డి, రమాకాంత్, మాధవనాయక్, సత్తయ్య, అప్పాని శ్రీనివాస్, సారంగపాణి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం రాపల్లికోటలో వర్షానికి తడిసి ఇల్లు కూలింది. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి సల్ల వెంకటయ్యకు చెందిన ఇల్లు కూలి వాసాలు కింద పడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

విరిగిపడిన చెట్టు

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం, యత్నారం, సింగంపల్లి, ప్రేమ్‌నగర్, పెగడపల్లి, కనుకునూర్ గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మండలంలోని కనుకునూర్ గ్రామంలో చెట్టు విరిగిపడింది. గ్రామానికి చెందిన బూపతి రమేష్ ఇంటి ఆవరణలో ఉన్న చెట్టు విరిగిపడటంతో టెంట్‌హౌస్ సామాను ధ్వంసం అయినట్లు బాధితుడు తెలిపాడు.





అనురాగాల రాఖీ

• అంతరాలు లేని అనుబంధం • నేడు రక్షాబంధన్

బుడిబుడి అడుగుల ప్రాయం నుంచి.. ప్రాణం ఉన్నంత వరకు ప్రేమాభిమానాలతో సాగేదే రక్తసంబంధం. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. సోదరుడు సుఖసంతోషాలతో ఉంటూ తనకు రక్షగా నిలవాలని ఆడబిడ్డ మనస్ఫూర్తిగా దీవిస్తూ రాఖీ కడుతుంది. అందుబాటులో లేని సోదరుల కోసం పరితపిస్తూ.. వారు ఎంత దూరంలో ఉన్నా వెళ్లేవారు కొందరైతే.. తోడబుట్టినవారు ఎక్కడున్నా తన రాఖీ వారి చేతికి అందాలని తపించే సోదరీమణులు మరికొందరు. వయోభారం ఇబ్బంది పెట్టినా అన్నదమ్ముల వద్దకు చేరాలని తపించేవారు ఇంకొందరు. రక్తం పంచుకుని పుట్టకున్నా అక్కా, చెల్లి అని ఆప్యాయంగా పిలిచే ఈ బంధానికి కులమత భేదాలు లేవు. అలాంటి ఆప్యాయత.. అభిమానం.. అనురాగాల వేడుక రాఖీ పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- సాక్షి, నెట్‌వర్క్

ఆశీర్వాదం కోసం అక్క ఇంటికే..

నల్లబెల్లి: మహబూబాబాద్ సీఐగా విధులు నిర్వహిస్తున్న భూక్యా శంకర్‌నాయక్ ఎస్సైగా ఉద్యోగం వచ్చిన నాటి నుంచి ఆశీర్వాదం పొందడానికి నల్లబెల్లి మండలం బిల్‌నాయక్ తండాలోని అక్క మాజీ ఎంపీటీసీ మాలోత్ సంధ్యారాణి ఇంటికి వచ్చి రాఖీ కట్టించుకుంటున్నాడు. నర్సంపేట మండలం బోజ్యానాయక్ తండాకు చెందిన భూక్య కస్నానాయక్–చిన్నమ్మ దంపతులకు కుమార్తెలు సంధ్యారాణి, శారద, కుమారులు శంకర్‌నాయక్, రాజునాయక్ సంతానం. వివాహం అయిన తర్వాత సంధ్యారాణి ప్రతి రాఖీ పౌర్ణమికి తల్లిగారింటికి వచ్చి సోదరులకు రాఖీ కట్టి దీవించి మురిసిపోయేది. ఈ క్రమంలో శంకర్‌నాయక్ 2012లో ఎస్సైగా ఎంపికై ఆదిలాబాద్‌లో విధులు నిర్వహించేవాడు. అక్క తన వద్దకు రావడానికి ఇబ్బందవుతుందని భావించి తానే బిల్‌నాయక్‌తండాకు వెళ్లి రాఖీ కట్టించుకుని సోదరి ఆశీర్వాదం పొందుతున్నాడు. వివిధ జిల్లాల్లో విధులు నిర్వర్తించిన ఆయన ప్రతీ పండక్కి అక్క ఇంటికి వెళ్లి రాఖీ కట్టించుకుంటున్నాడు.



అక్క, బావ ఆశీర్వాదం తీసుకుంటున్న సీఐ భూక్యా శంకర్‌నాయక్ (ఫైల్)



ఎంవీఐకి రాఖీ కడుతున్న శ్రీదేవి (ఫైల్)

తోడబుట్టకున్నా..

కాజీపేట రూరల్ : బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కాజీపేట శాఖ నిర్వాహకురాలు శ్రీదేవి ఆధ్వర్యాన ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని అధికారులకు, అనధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటుతున్నారు. కాజీపేట డీజిల్‌కాలనీలో 1994 సంవత్సరం బ్రహ్మకుమారీల కార్యాలయాన్ని ప్రారంభించారు. తోడపుట్టకున్నా.. ఎలాంటి బాంధవ్యాలు లేకున్నా సోదర భావంతో క్రమం తప్పకుండా ప్రతి ఏటా రాఖీలు కట్టి అన్న, తమ్ముడు, చెల్లెల అనుబంధ సంస్కృతిని చాటుతున్నారు. కాజీపేట డీజిల్‌కాలనీ కార్యాలయం కేంద్రంగా కాజీపేట, హనుమకొండతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో పని చేస్తున్న అధికారులు, అనధికారులు, రైల్వే కార్మికులు, పోలీసు అధికారులు, ఇతర విభాగాల వారికి ఆనవాయితీగా రాఖీలు కట్టి బ్రహ్మకుమారీలు ఆధ్యాత్మిక గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు.

మహమూద్‌కు రాఖీ కడుతున్న శిరీష(ఫైల్)



కుల మతాలకు అతీతం

కాజీపేట: అన్నా చెల్లెల అనుబంధానికి కుల, మతాలతో సంబంధం లేదు. ముస్లిం యువకుడిని సోదరుడిగా భావించి 25 ఏళ్లుగా రాఖీ కడుతోంది శిరీష. కాజీపేట పట్టణానికి చెందిన మహమూద్ ఇంటి పక్కనే శిరీష కుటుంబం ఉండేది. రెండు కుటుంబాల మధ్య అన్యోన్య బాంధవ్యాలు ఉండేవి. ప్రతి రాఖీ పౌర్ణమి పండుగకు చిన్నతనం నుంచి శిరీష మహమూద్‌కు రాఖీకడుతోంది. ఆమెకు వివాహం అయి అత్తవారింటికి వెళ్లినా ప్రతీ ఏడాది రక్షాబంధన్‌కు భర్త వినయ్‌తో కలిసి వచ్చి రాఖీ కడుతోంది. సోదరుడి నుంచి నూతన వస్త్రాలు కానుకగా అందుకుంటోంది.

వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన సమీనా.. మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్‌కు పదేళ్లుగా రాఖీ కడుతోంది. అక్కా తమ్ముళ్ల అనురాగానికి కుల, మతాలు అడ్డురావనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.



దామోదర్‌కు రాఖీ కడుతున్న సమీనా (ఫైల్)

దూరాలు ఎరగని 'బంధం'

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇమ్మడి శ్రీనివాసరావు–కవిత దంపతుల కుమారుడు సాయిసీతారాం కాలిఫోర్నియాలో ఉంటున్నాడు. ప్రతి ఏడాది ఆయన సోదరీమణులు రవళి, హారిక రాఖీలు పంపిస్తూ తమ ప్రేమను చాటుతున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉంటున్న సోదరుడు కొదుమూరి ప్రవీణ్‌కు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అయిత శ్రావణి ప్రతి ఏడాది కొరియర్ ద్వారా రాఖీ పంపిస్తే ఆయన తన కుమార్తె ఆర్షతో కట్టించుకుంటున్నారు.



ప్రవీణ్‌కు రాఖీ కడుతున్న కుమార్తె ఆర్ష(ఫైల్)



కాశీపతికి రాఖీ కడుతున్న చెల్లి ఊర్మిల (ఫైల్)

రాఖీ కట్టే వరకు మంచి నీళ్లు ముట్టరు..

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కొత్తపల్లి తిరుపతయ్య–జయప్రద దంపతులకు రాజయ్య, కాశీపతి, మురళి, ఊర్మిల సంతానం. వీరందరికన్నా పెద్ద సోదరి పెద్ది సునంద కాలం చేశారు. వీరి చెల్లెలు ఊర్మిల వివాహం 1980లో జగదేవపూర్‌కు చెందిన ఎర్రం కృష్ణమూర్తితో అయింది. వారు వ్యాపార నిమిత్తం సిద్దిపేటలో ఉంటున్నారు. అప్పటి నుంచి ఊర్మిలకు పనుల్లో తీరికలేకున్నా రాఖీ పౌర్ణమికి బచ్చన్నపేటకు వచ్చి అన్నలకు రాఖీ కడుతుంది. ప్రతి సంవత్సరం రక్షాబంధన్ రోజు చెల్లి ఊర్మిల వచ్చి రాఖీ కట్టే వరకు ముగ్గురు అన్నదమ్ములు పచ్చి మంచి నీళ్ల కూడా ముట్టరు.

దేవుడిచ్చిన గొప్పవరం..

పెద్దవంగర: అక్కకు తమ్ముడు.. చెల్లికి అన్న.. ఇలా ఒక్కరైనా ఉండాలి. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల బంధం దేవుడిచ్చిన గొప్పవరం. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన మునుగోటి సుశీల–సోమయ్య దంపతులకు కొడుకులు మధు, అశోక్, కూతురు శ్రీలక్ష్మి సంతానం. 'ముగ్గురం కలిసే పెరిగాం.. కలిసే ఎదిగాం.. ఏదైనా సమస్య వస్తే ఒకరికొకరం చర్చించుకుని పరిష్కారానికి మార్గం వెతుక్కునే వాళ్లం.. ఏ కష్టం వచ్చినా అన్నయ్యలు ఉన్నారనే భరోసా ఎప్పటికీ ఉంటుంది.. 40 ఏళ్లుగా ప్రతీ ఏడాది రాఖీ కడుతున్నా.. 'సోదరీ సోదరుల బంధం ప్రాధాన్యతను తెలిపే రక్షాబంధన్ పండుగను.. అందరూ ఆనందంగా జరుపుకోవాలి'.. అని శ్రీలక్ష్మి సూచించారు.



మధుకు రాఖీ కడుతున్న చెల్లి శ్రీలక్ష్మి(ఫైల్)

ఏడు పదుల వయసులోనూ..

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన పోగుల లక్ష్మీనారాయణకు ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు. లక్ష్మీనారాయణకు అక్క పాశికంటి సుశీల ఏడుపదుల వయస్సులోనూ తన అత్తగారి ఇల్లు అయిన మంగపేట నుంచి ప్రతి ఏడాది ఏటూరునాగారం వచ్చి రాఖీ కడుతున్నది. పండుగను అత్యంత సంప్రదాయంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అక్క అంటే తమ్ముడికి ఎంతో ప్రేమ.. తమ్ముడు అంటే అక్కకు ప్రాణం. ఇలా అక్కా తమ్ముడి బంధం జన్మజన్మలు ఇలానే ఉండాలని లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.



లక్ష్మీనారాయణకు రాఖీ కడుతున్న అక్క సుశీల(ఫైల్)

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



గర్భగుడిలో అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరం: శ్రావణమాసం సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ద్విలింగాలకు అభిషేక, అర్చనలు నిర్వహించారు. శ్రీశుభానందదేవి, శ్రీమహాసరస్వతి అమ్మవార్ల ఆలయంలో పూజలు చేశారు. ప్రాకారదేవతలను దర్శించుకున్నారు. సాయంత్రం (ప్రదోష కాలం) లక్షపత్రి పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిల్వదళాలతో ద్విలింగాలకు సమర్పించి పూజించారు. దీంతో ఆలయంతో పాటు పరిసరాల్లో భక్తులు సందడి నెలకొంది.

సీఆర్పీఎఫ్ సేవలు వెలకట్టలేనివి

• డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి



సీఆర్పీఎఫ్ అధికారులను సన్మానిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ, ఎస్సై

కాటారం: అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడంతో పాటు సమాజ సేవలో సీఆర్పీఎఫ్ బలగాల సేవలు వెలకట్టలేనివని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాటారం పరిధిలో పనిచేస్తున్న 58 బెటాలియన్ సీఆర్పీఎఫ్ బలగాలు మణిపూర్ రాష్ట్రానికి బదిలీ అయిన విషయం విదితమే. ఆదివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ బలగాలకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బందిని డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు అందించిన సేవలను కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు సైతం ఎంతగానో కృషిచేస్తూ వచ్చాయని పేర్కొన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాం పేరిట సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఎంతో మంది నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడంతో పాటు యువతకు ఉపాధి మార్గాలు, క్రీడాకిట్లు, ఆయా రంగాల్లో ప్రోత్సహించేలా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున రావు, ఎస్సై మ్యాక అభినవ్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వీర్పాల్ సింగ్, జవాన్లు మనోహర్ పాల్గొన్నారు.

రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు





రాఖీ సందడి

భూపాలపల్లి అర్బన్: రాఖీ పండగ సందర్భంగా ఆదివారం జిల్లాకేంద్రంలో సందడి నెలకొంది. జిల్లాకేంద్రంలోని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలను ముందుస్తు నిర్వహించారు. పండగను పురస్కరించుకొని ప్రధాన రహదారి వెంట నూతనంగా రాఖీ దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు, యువత రాఖీలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావడంతో దుకాణాలు, కంగన్‌హాళ్లు కిటకిటలాడాయి. స్వీట్ల కొనుగోలు కోసం స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు కిక్కిరిసిపోయాయి. రాఖీల ధరలు గతేడాది కంటే అధికంగా పెరిగినట్లు వినియోగదారులు అంటున్నారు.



సీఐకి రాఖీ కడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

వరదతో మూలకు బోట్లు



త్రివేణి సంగమం వద్ద వరద ఉధృతితో మూలకు కట్టిపెట్టిన బోట్లు

కాళేశ్వరం: మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధికి దెబ్బపడింది. గత జూలై చివరి నుంచి నేటి వరకు వర్షాలు ఏకధాటిగా కురుస్తుండడంతో కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బోట్లతో కాళేశ్వరాలయానికి వచ్చే భక్తులు, గోదావరి వద్ద అస్తిక పూజలు నిర్వహించే వారిని దింపుతూ 90కిపైగా కుటుంబాలు జీవిస్తుంటాయి. వరద ఉధృతి పెరిగి అలాగే నెలల తరబడి నిలిచి ఉండడంతో అధికారుల సూచనల మేరకు తాళ్లతో మూలకు కట్టేశారు. దీంతో ఉపాధి లేక గంగపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు.

గొప్ప పోరాటయోధుడు పాపన్న

• జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: దోపిడీ, భూస్వాముల, పెత్తందారి వ్యవస్థకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఐడీఓసీ కార్యాలయం సమావేశపు హాలులో ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న 17వ శతాబ్దంలోనే దోపిడీ, భూస్వాముల పెత్తందారి వ్యవస్థకు ఎదురుతిరిగిన గొప్ప బహుజన విప్లవకారుడన్నారు. సాధారణ గౌడ కుటుంబంలో పుట్టి వివిధ కులాలకు చెందిన 12మంది స్నేహితులతో సైన్యాన్ని స్థాపించి 12వేల మంది సైనికులను తయారుచేసి గోల్కొండ కోటలో జెండా ఎగరేసిన గొప్పవీరుడని కొనియాడారు. సమాజంలో నేటి యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ అధికారి శైలజ, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్, ఎస్ఎస్ఆర్ సంపత్ రావు, కాంగ్రెస్ నాయకుడు గాజర్ల అశోక్, టీపీసీసీ సభ్యుడు మధు పాల్గొన్నారు.

రోగులకు 'పరీక్ష'

- అడ్డగోలుగా ఫైనల వసూళ్లు
- రోగుల బలహీనతతో వ్యాపారం
- అర్హత లేని టెక్నీషియన్లు
- వైద్యారోగ్యశాఖ తనిఖీలు శూన్యం

భూపాలపల్లి అర్బన్: రోగుల వ్యాధిని నిర్ధారించే పరీక్ష కేంద్రాల (ల్యాబ్) నిర్వహణ జిల్లాలో అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని ఆస్పత్రులలో వైద్యులే టెక్నీషియన్‌లను ఏర్పాటు చేసుకుని ల్యాబ్‌లు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. జిల్లాకేంద్రంతో పాటు మండలాలు, గ్రామాలైన కాటారం, చిట్యాల, గణపురం, మహదేవపూర్, కాళేశ్వరం, చెల్పూర్‌లలో ఈ తతంగం ఏళ్ల తరబడి కొనసాగుతున్నా వైద్యారోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అనుమతులే లేవు..

జిల్లాలో 25 ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ కొందరు ఇతర ఆస్పత్రుల్లో అసిస్టెంట్‌లుగా పనిచేసి సొంత పరిజ్ఞానంతో సొంతంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకొని ఆర్ఎంపీలు, పీఎంపీలు, ఇతర ఆస్పత్రుల డాక్టర్లతో కుమ్మక్కై రక్త నామూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఆర్ఎంపీ డాక్టర్ల ప్రథమ చికిత్స కేంద్రాల్లో, ఇతర సొంత గదుల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకొని పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్‌లు..

జిల్లాలో ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. డయాగ్నోస్టిక్ సెంటర్లు పాథాలజీ చదివిన వారి పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కొన్ని సెంటర్లు నడుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ల్యాబ్‌లో ఎంఎల్‌టీ పూర్తి చేసిన వారు ఉండాలి. కానీ చాలా కేంద్రాల్లో అనర్హులే ఉన్నారు. జిల్లాకేంద్రంతో పాటు మండలాల్లో ఈ తరహా దందా కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

దృష్టిసారించని వైద్యారోగ్యశాఖ

ప్రైవేట్ ఆస్పత్రులలో కనీస సౌకర్యాలు, వైద్యసేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ నిబంధనలు పాటించకున్నా అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఆస్పత్రి లైసెన్స్ నుంచి మొదలు ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్‌ల వరకు తనిఖీ చేయాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని వారి పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులతో అనుసంధానమైన ల్యాబ్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. వాటిలో కూడా అర్హత కలిగిన టెక్నీషియన్లను నియమించాలి. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే ఫీజులు తీసుకోవాలి. అనవసరపు పరీక్షలు చేయవద్దు. తప్పుడు రిపోర్టులు ఇచ్చి రోగులను ఇబ్బందులకు గురి చేయవద్దు. - డాక్టర్ మధుసూదన్, డీఎంహెచ్‌ఓ

అంచలంచెలుగా అభివృద్ధి..

నేడు 49వ వసంతంలోకి కాకతీయ యూనివర్సిటీ..

- ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు
- న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించినా.. సమస్యలే
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- బోధన, పరిశోధనలపై తీవ్ర ప్రభావం
- రెగ్యులర్ వీసీ నియామకంలో జాప్యం



కేయూ పరిపాలన భవనం

కేయూ క్యాంపస్ : నిత్య చైతన్య దీప్తిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన చదువుల ఒడి.. కాకతీయ యూనివర్సిటీ. ఉద్యమాల గడ్డ.. పోరాటాల అడ్డగా పేరొందిన కాకతీయ యూనివర్సిటీ.. తెలంగాణ రాష్ట్రంలో ఓయూ తరువాత ప్రతిష్టాత్మక యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించి విద్యార్థుల ప్రాధాన్య యూనివర్సిటీగా మారింది. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీతో (సోమవారం) 48 వసంతాలు పూర్తిచేసుకుని 49 వసంతంలోకి అడుగుపెట్టబోతోంది. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం. తొలుత ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ప్రారంభమై.. ఆ తరువాత 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీగా ఆవిర్భవించింది. ఈ 48 ఏళ్లలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కేయూ.. నేడు అనేక సమస్యలతో సతమతమవుతూ పాఠాలు చెప్పేందుకు, వివిధ విభాగాల్లో పరిశోధనలకు రెగ్యులర్ ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. దీంతో యూనివర్సిటీ ప్రతిష్ట మసకబారుతోంది. ఒకప్పుడు కేయూలో సీనియర్ ప్రొఫెసర్లతో విద్యతోపాటు పరిశోధనలు విస్తృతంగా జరిగేవి. అంతేగాకుండా కొందరు ప్రొఫెసర్లు విద్యతోపాటు సామాజిక సమస్యలపై కూడా విద్యార్థులతోపాటు ఉద్యమాల్లో భాగస్వాములయ్యేవారు. కేయూ అంటే విప్లవ ఉద్యమాల యూనివర్సిటీగా పేరుండేది. ఇక్కడ చదివిన విద్యార్థులు అనేకరంగాల్లో రాణిస్తున్నారు. సమాజం కోసం విప్లవోద్యమం బాటపట్టిన వారు కూడా ఉన్నారు. ఇది అంతా గతం. తెలంగాణ ఉద్యమంలోనూ కేయూ విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు కీలక పాత్రపోషించారు. తెలంగాణ సాధనతో కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిలో పయనిస్తుందని, సమస్యలు పరిష్కారమవుతాయని అంతా భావించారు. కానీ సమస్యలు పరిష్కారం కాకపోగా ప్రభుత్వం ప్రైవేట్ వర్సిటీలను తీసుకొస్తూ ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తుందని కొందరు విద్యావేత్తలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిధుల లేమితో కేయూ అనేక సమస్యలతో సతమతమవుతోంది. విద్యార్థులకు తరగతులు అంతంత మాత్రంగానే జరుగుతున్నా పర్యవేక్షణ చేసేవారేకరువయ్యారు. కొందరి అధ్యాపకులు పాలన పదవుల నిర్వహణలోనే బిజీగా ఉంటున్నారు. కేయూకు రెగ్యులర్ వీసీ నియామకంలో జాప్యం జరుగుతోంది.

నాలుగు విభాగాలతో మొదలై.. 28 విభాగాల వరకు

కాకతీయ యూనివర్సిటీ తొలుత నాలుగు విభాగాలతో (కోర్సులు) ప్రారంభమైంది. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతోంది. మూడు ఉమ్మడి జిల్లాల్లోని 11 జిల్లాల పరిధిలో ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 292 వరకు ఉండగా పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్ 6, ఫార్మసీ 25, ఎడ్యుకేషన్ 41, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, లా కళాశాలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్‌మేనేజ్‌మెంట్ కళా శాలలు 3 ఉన్నాయి. డిగ్రీ ఆయా కోర్సులు కలిపి లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు.

కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లతోనే..

కాకతీయ యూనివర్సిటీలో సుమారు 180 వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 200 మంది వరకు పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారం ఏది?

కాకతీయ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కావడం లేదని ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 79 మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు కావడం లేదని, ఆ సమస్య పరిష్కరించాలని కోరుతూ వస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణను ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ బాధ్యులు కలిసి విన్నవించారు. వీరి సమస్యల పరిష్కారానికి ఇటీవల రిజిస్ట్రార్ మల్లారెడ్డి సమక్షంలో చర్చించారు. తన పరిధిలో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మిగతా సమస్యల పరిష్కారాకి ఒకే చెప్పారని సమాచారం.

భూముల అన్యాక్రాంతంపై చర్యలేవి?

కాకతీయ యూనివర్సిటీలో పలుచోట్ల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. భూమిని కాపాండేందుకు ప్రహరీ నిర్మాణానికి ఇటీవల ఉపక్రమించి మళ్లీ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

ఇన్‌చార్జ్ వీసీ కరుణ పాలన భేష్..

కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ పాలన భేష్ అని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది. ఎందుకంటే మూడేళ్లలో రెగ్యులర్ వీసీ కొంత ఇష్టారాజ్యంగా వ్యవహరించి పలు సమస్యలు పెండింగ్‌లో పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరుణ పాలన చేపట్టి మూడు నెలలు కావొస్తుంది. కరుణ యూనివర్సిటీకి ఒక్కసారి మాత్రమే వచ్చి వెళ్లారు. వర్సిటీ సమస్యలపై అవగాహన కలిగి ఉండి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. అయితే వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఫైళ్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి సంబంధిత సిబ్బందితో తరచూ హైదరాబాద్‌కు వెళ్లి రావడం ఇబ్బందికరంగా మారింది. అప్పుడప్పుడైనా ఇన్‌చార్జ్ వీసీ యూనివర్సిటీకి వస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, హైదరాబాద్ నుంచే పాలన కొనసాగిస్తున్నా పలు సమస్యలు పరిష్కరించారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ కొలిక్కి తీసుకొచ్చారు. మొదటి కేటగిరీలో మిగిలిన సీట్లను పీహెచ్‌డీ రెండో కేటగిరీలోకి మార్పించారు. అందులో 72 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లకు అప్రూవల్ ఇచ్చారు. అలాగే, ఈ ఏడాది మార్చి 31వరకు వేకెన్సీలను గుర్తించి అందులో విభాగాల వారీగా వేకెన్సీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఉన్న మెరిట్‌జాబితా ప్రకారమే భర్తీచేసేందుకు వారం రోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలని డీన్లను ఆదేశించారు.

- కెరీర్ అడ్వాన్స్‌మెంట్‌కింద స్కీం కింద (క్యాస్) నోటిఫికేషన్ ఇచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లు గాను, అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు దరఖాస్తుల ప్రక్రియ నిర్వహించారు.
- కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సెక్యూరిటీ గార్డుల సర్వీసెస్‌కు టెండర్లను పిలిపించి నూతన సెక్యూరిటీ సర్వీసెస్‌కు అప్పగించారు.
- ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒక్క ప్రొఫెసర్ వివిధ విభాగాలకు అధిపతులుగా ఉండగా విభాగాల వారీగా ఆయా అధ్యాపకులను నియమించారు.
- మహిళా హాస్టల్‌లో బెడ్స్‌కు, మరో మహిళా హాస్టల్‌కు డైనింగ్ హాల్ నిర్మాణానికి, బాయ్స్‌హాస్టల్‌లో డైనింగ్‌హాల్‌లోని స్టీల్ టేబుల్, ఫర్నిచర్ కొనుగోళ్లకు నిధులు మంజూరు చేస్తూ అప్రూవల్ ఇచ్చారు.
- పెండింగ్‌లో ఉన్న 40మంది అధ్యాపకుల ఏరియర్స్‌ను కూడా విడుదల చేయించారు.
- ఇటీవల కేయూ పాలకమండలి సమావేశం నిర్వహించి రెగ్యులర్ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీకి యూనివర్సిటీ ఈసీ నామినీని కూడా ప్రతిపాదిచారు.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

కాకతీయ యూనివర్సిటీలో ప్రధానంగా రెగ్యులర్ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. యూనివర్సిటీలో అన్ని విభాగాలు కలిపి 409 అధ్యాపకుల (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల) పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 83 మంది అధ్యాపకులే ఉన్నారు. ఇందులో ఇద్దరు ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. మిగతా పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. గత ప్రభుత్వం 136 పోస్టులు మంజూరు చేసినా ఇప్పటికీ నియామకం లేదు.

క్లుప్తంగా

పిచ్చి కుక్క దాడి.. ఏడుగురికి గాయాలు



గాయపడిన వారికి వైద్య సేవలు అందజేస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): పిచ్చి కుక్క దాడిలో మండలంలోని నూగూరు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యకులు గాయపడ్డారు. ఆదివారం పిచ్చి కుక్క గ్రామ వీధుల్లో సంచరిస్తూ బయటకు వచ్చిన ఇండ్ల ముత్యాలు, ఇండ్ల వెంకటేశ్, ముకల మాణిక్యం, ఇండ్ల లక్ష్మయ్య, పెద్ది లక్ష్మయ్య, మేకల శిరీష, మధు ప్రియపై దాడికి పాల్పడింది. ఈ ఘటనలో వారికి గాయాలు కావడంతో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. తీవ్ర గాయాలైన పెద్ది లక్ష్మయ్య, ఇండ్ల వెంకటేశ్‌ను ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ వైరు తెగిపడి గేదెలు మృత్యువాత

- రైతుకు రూ. 2 లక్షలకు పైగా నష్టం



గేదెల కళేబరాలు

నర్మెట: విద్యుత్ వైరు తెగి పడడంతో మూడు గేదెలు, ఓ దూడ మృత్యువాత పడింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని వెల్దండలో చోటు చేసుకుంది. వెల్దండ– కేసిరెడ్డిపల్లి దారిలో తీగల బావి ప్రాంతంలో రైతు వంగ భూపాల్‌రెడ్డికి చెందిన పశువుల కొట్టం ఉంది. కొట్టం పక్క నుంచే విద్యుత్ స్తంభాలు వెళ్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ తీగ తెగి పడడంతో పచ్చిక మేస్తున్న మూడు గేదెలు, ఓ దూడ విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో రూ. రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు వంగ భూపాల్ రెడ్డి కన్నీరుమన్నీరయ్యాడు. కాగా, తీగలు సరిచేయాలని గతంలో పలుమార్లు తెలిపినా సంబంధిత అధికారులు స్పందించలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే భూపాల్ రెడ్డి నష్టపోయాడని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

భూవివాదంలో వ్యక్తిపై కేసు

- పురుగుల మందు తాగి పోలీసుస్టేషన్‌కు వచ్చి హల్‌చల్

గార్ల: భూవివాదంలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తనపై ఎలా కేసు నమోదు చేస్తారంటూ ఓ వ్యక్తి పురుగుల మందు సేవించి పోలీసుస్టేషన్ బయట హల్‌చల్ చేశాడు. ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ ప్రకారం.. గార్ల మండలం చిన్నకిష్టాపురం జీపీ సర్వన్‌తండాకు చెందిన మాలోత్ రవిరాజ్, మాలోత్ భద్రు మధ్య భూవివాదంలో ఘర్షణ జరిగింది. ఈ వివాదంలో రవిరాజ్‌పై కేసు నమోదైంది. దీంతో రవిరాజ్ ఆదివారం ఉదయం పురుగుల మందు సేవించి పోలీసు స్టేషన్‌లోకి వచ్చి తనపై ఎలా కేసు నమోదు చేస్తారంటూ హల్‌చల్ చేశాడు. 'నేను పురుగుల మందు తాగా.. చనిపోతే పోలీసులందరూ బాధ్యులవుతారు' అంటూ స్టేషన్‌లో వీరంగం సృష్టించారు. దీంతో పోలీసులు అతడిని సీహెచ్‌సీ తరలించి వైద్యసేవలు అందించారు. ఈ ఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో రవిరాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్ కుమార్ పేర్కొన్నారు.



పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కాటమయ్య కిట్లను అందజేస్తున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ దివాకర టీఎస్

ములుగు: సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదివారం ములుగు కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం, సమాజం కోసం పోరాడిన వారిని ఎప్పుడూ మర్చిపోవద్దన్నారు. పాపన్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించిందన్నారు. 'నీ కోసం పనిచేస్తే నీలోనే ఉండి పోతావు, జనం కోసం పనిచేస్తే జనంలో ఉండిపోతావు' అని గొప్ప విషయాలు చెప్పి మహనీయుడు పాపన్నగౌడ్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంలోని ఖిలాషాపూర్‌లో జన్మించి పశువుల కాపరిగా ఉంటూనే రాజుల సైన్యాలు, వారి ఆగడాలను ఎదురించారని గుర్తు చేశారు. ఉమ్మడి హక్కుల కోసం పోరాడి అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. అనంతరం వంద మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందించారు. కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ తనతో ఎలాంటి సైన్యం లేకున్నా అప్పటి రాజులతో పోరాడారన్నారు. పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ సంపత్‌రావు, ఎక్సైజ్ సీఐ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో గుంజేడు ఆలయ ఈఓ

- లంచం తీసుకుంటూ పట్టుబడిన భిక్షమాచారి
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆలయ ఈఓ భిక్షమాచారి



ఈఓ భిక్షమాచారిని విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కొత్తగూడ: గుంజేడు ముసలమ్మ ఆలయ ఈఓ భిక్షమాచారి ఏబీసీ వలలో చిక్కుకున్నారు. ఆదివారం రూ. 20 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. ఆలయ ఈఓ భిక్షమాచారి ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయించుకునే షాపు యజమాని సాంబయ్యను పలుమార్లు డబ్బుల కోసం ఇబ్బంది పెట్టేవాడు. ఈ ఘటనపై షాపు యజమాని.. ఈఓ లంచం అడిగే వీడియో ఆధారంగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం ప్రకారం టికెట్ కౌంటర్‌పై ఉన్న ఈఓకు షాపు యజమాని ద్వారా రూ. 20 వేలు పంపించగా తీసుకుని తన లాకర్‌లో వేసుకుంటున్నాడు. అప్పటి వరకు పూజలు చేస్తున్నట్లు నటించిన ఏబీసీ అధికారులు ఈఓను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒకే సమయంలో ఈఓ ఇంటి వద్ద కూడా తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. ఈఓను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయి విచారణ అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వివరించారు. ఆయన వెంట ఎస్సై శ్యామ్‌సుందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

మరిపెడ: మరిపెడలో గుంజేడు ముసలమ్మ దేవాలయ ఈఓ భిక్షమాచారి రూ. 20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడడంతో ఆయన స్వగృహం మరిపెడలో ఏసీబీ అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఏసీబీ సీఐ ఎస్. రాజు తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. రాత్రి 7గంటల సమయం వరకు 27తులాల వెండి, రూ. 70వేలు, 4 గ్రాముల బంగారం లభించినట్లు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయి.

బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా..

- ఆటో బోల్తా
- పది మందికి గాయాలు



ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఏటూరునాగారం: బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా ఏటూరునాగారం– తాడ్వాయి మధ్యలో చోటు చేసుకుంది. ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లికి చెందిన పది మంది తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో తన సమీప బంధువు మృతి చెందడంతో దహన సంస్కారాల నిమిత్తం ఆటోలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన 108లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కన్నెబోయిన మల్లమ్మ, ఎర్రబోయిన నాగేంద్ర, తీగల సారమ్మ, ఎద్దుల మహేశ్వరి, పర్శబోయిన రమ, తీగల రమాదేవి, తీగల దుర్గ, తీగల కనక దుర్గ, అంతటి తిరుమలేశ్, పర్శబోయిన ఓదెలు, ఎర్రబోయిన శ్రీలతకు గాయాలయ్యాయి.

నాన్నకు ప్రేమతో..

- తండ్రి విగ్రహం ఏర్పాటు చేసిన కొడుకులు



తండ్రి వీరస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న కుమారులు, కుటుంబ సభ్యులు

కేసముద్రం: కానరానిలోకాలకు వెళ్లిపోయిన తండ్రి విగ్రహం ఏర్పాటు చేసి తమ ప్రేమను చాటుకున్నారు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాంతండాజీపీ శివారు కాలనీతండా చెందిన ఇద్దరు కుమారులు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీతండాకు చెందిన పోలెపాక వీరస్వామి–సరోజన దంపతులకు కుమారులు కమలాకర్, రాజు, కుమార్తెలు స్వరూప, రమ, సునీత సంతానం. 2022 ఆగస్టు 18న వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన జ్ఞాపకాలను కుటుంబం సభ్యులు నెమరువేసుకుంటూ ఆవేదనకు లోనవుతున్నారు. వీరస్వామి మూడో వర్ధంతి సందర్భంగా తన ఇద్దరు కుమారులు రూ. లక్ష వెచ్చించి అవుసలితండాలోని తమ పంటపొలంలో తండ్రి వీరస్వామి విగ్రహం ఏర్పాటు చేసి గుడి కట్టించారు. దానిని ఆదివారం కుటుంబ సభ్యులు ఆవిష్కరించి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎశబోయిన ఎల్లయ్య, శతకోటి నరేశ్, విజేందర్, కొంరయ్య, నరేందర్, వాల్యా పాల్గొన్నారు.

అప్పల బాధతో యువకుడి ఆత్మహత్య

- శాలపల్లిలో ఘటన



అనిల్ కుమార్ (ఫైల్)

వేలేరు: అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని శాలపల్లి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దామెర కోమలకు ఇద్దరు కూమారులు, ఒక కుమార్తె ఉంది. పెద్ద కుమారుడు అనిల్ కుమార్(31) గ్రామానికే చెందిన ఓ వ్యక్తి వద్ద భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత సంవత్సరం సాగు చేసిన పంటలో రూ.3లక్షల వరకు నష్టం వచ్చింది. ఆరు నెలల క్రితం చిన్న కుమారుడు అశోక్‌కు యాక్సిడెంట్ కాగా రూ.1.50లక్షల ఖర్చు అయ్యింది. మూడు నెలల క్రితం అనిల్‌కు యాక్సిడెంట్ కాగా కాలు విరగడంతో దాదాపు రూ.లక్ష ఖర్చు అయ్యింది. వ్యవసాయంతో పాటు కుటుంబ అవసరాలకు సుమారు రూ.6లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని అనిల్‌కుమార్ రోజూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి వెంటనే 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఈఘటనపై మృతుడి తల్లి కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

క్షణికావేశంలో వెల్లంపల్లిలో మహిళ..

టేకుమట్ల: క్షణికావేశంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాపాల రజిత(45) ఆదివారం ఉదయం ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో తన కూతురితో గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో రజిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు గమనించి చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

అప్పలున్నా 'ఆరుగ్యారంటీ'ల అమలు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పరకాలలో రూ.16.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ(పరకాల): గత పాలకుల పుణ్యమా అంటూ రూ.7లక్షల 12వేల కోట్ల అప్పుల భారం మోస్తూనే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ప్రజలు, రైతులను తప్పుడు ప్రచారాలతో రెచ్చగొట్టాలని చూస్తున్నాయని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో రూ.5కోట్లతో పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74 కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించి పనులను ప్రారంభించారు. అనంతరం పరకాల మున్సిపాలిటీ, నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో ఈ ప్రాంత అభివృద్ధి రూపురేఖలు మారనున్నాయన్నారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్క్‌కు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చలు జరిపారని తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులు టెక్స్‌టైల్ పార్క్‌లో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం నెల రోజుల వ్యవధిలోనే రూ.19 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. మరో రూ.12 వేల కోట్ల రుణాలు త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, 'కూడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పరకాల ఆర్డీఓ కె.నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ కె.నరసింహ పాల్గొన్నారు.

కొనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తాం..

జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్సార్ హయాంలో కొనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సుమారు రూ.41 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆయా పనులు పూర్తి చేయడం కోసం గత ప్రభుత్వ రూ.114 కోట్లకు పెంచినా పూర్తి చేయలేకపోయిందన్నారు. ఈ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. అలాగే, గత పాలకులు పరకాల 100 పడకల ఆసుపత్రి పనులను మొక్కుబడిగా ప్రారంభించి వదిలిపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అంతస్తు పనులు పూర్తి చేసి శిథిలవస్థలో ఉన్న పాత ఆసుపత్రిని ఇందులోకి తరలిస్తుందని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- గోవిందరావుపేట, చల్వాయి మధ్య ఘటన



అహ్మద్ పాషా మృతదేహం

గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి దుర్మరణం చెందాడు.ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని జాతీయ రహదారి 163పై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బుస్సాపూర్‌కు చెందిన ఎస్‌డీ అహ్మద్ పాషా(18) రోజూ సాయంత్రం మండల కేంద్రంలోని పాల ఉత్పత్తి దారుల కేంద్రంలో పాలు పోయడానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే రోజువారీగా పాలు పోసి వస్తున్న క్రమంలో గోవిందరావుపేట, చల్వాయి గ్రామాల మధ్య సోమలగడ్డ క్రాస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అహ్మద్ పాషా అక్కడికక్కడే మృతి చెందాడు.

నిడిగొండ పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

- సీఈఓ నిర్లక్ష్యం.. రైతు రుణమాఫీకి శాపం
- మూడు విడతల్లో ఒక్కరికీ మాఫీ కాని వైనం



నిడిగొండ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

రఘునాథపల్లి: నిడిగొండ కోఆపరేటివ్ సొసైటీ సీఈఓ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన మూడు విడతల నిధుల్లో సొసైటీలోని ఒక్క రైతుకు రుణమాఫీ జరగలేదు. అర్హుల జాబితా సరిగా ఇవ్వడంలో విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని పాలకమండలి నిర్ధారణకు వచ్చింది. నిర్లక్ష్యానికి కారణమైన సీఈఓ పెద్దగోని రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీసీఓ రాజేందర్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని సొసైటీ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి ఆదివారం ధ్రువీకరించారు. సొసైటీలో 3760 మంది సభ్యులున్నారు. వీరిలో చాలా మంది రైతులు పంట రుణాలు తీసుకుని రెన్యూవల్ చేసుకున్నారు. రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం 9 డిసెంబర్ 2023ను కటాఫ్ తేదీగా పేర్కొంది. సొసైటీలో 554 మంది రైతులు అర్హులుగా 2.55 కోట్లు మాఫీ చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. అయితే 135 మంది రైతుల ఆధార్ వివరాలు తప్పుగా నమోదు చేయడం లాంటివి ఆడిట్‌లో బయటపడడంతో మూడు విడతల్లో ఏ ఒక్క రైతు రుణమాఫీకి నోచుకోలేదు. దీంతో తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. కాగా, గత పాలకమండలి హయాంలో రుణాల మంజూరుకు సంబంధించి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిగా రుణం చెల్లించినా, ఇప్పుడు బకాయి ఉన్నట్లు చూపుతుందని, దీంతో రుణ మాఫీకి అర్హులం కాకుండా పోయామని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.